# బర్కతు

"రం డ్రి, రండ్రి" కొడుకు, కోడలుకు స్వాగతం పలికింది మనెమ్మ. అమ్మ కాళ్ళకు నమస్కారం చేశారు మహీధర్, లహరి.

"బాగా బక్కవడ్డవు బిడ్డా"

"పొద్దుగల్ల ఎనిమిదేంగ ఇంట్లకెల్లి ఎల్తినంటే, మల్ల ఇంటికి అచ్చేతందుకు పదెగుతయి. అయితారం (ఆదివారం) రజ (సెలవు) రోజు ఇంటి పనులెన్నో! మీ కోడలుకు మరాఠి రాకపాయె. నేనే అన్ని వస్తువులు తీస్కరావాలె. నాతోని బజారుకు తీస్కపోతున్నా. కొంచెం, కొంచెం బాసఅలువాటయింది లహరికి."

హన్‌మాన్ గల్లి, పత్రాచాల్లో ఉన్న మనెమ్మ వాళ్ళది వందడుగుల ఒంటిగది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగంలో ఉన్న కొడుకు పెళ్ళి అయింతర్వాత ఆగది ఇరుకవడంతో ఇక గత్యంతరం లేక, ముంబయి శివార్లల్లో ఉన్న భయందర్‌లో కాపురం పెట్టాడు. నెల, రెన్నెల్లకొకసారి వీరైనా, వారైనా ఒకరింటికొకరు వస్తూ, పోతుంటారు.

"ఈడ మేమందరం ఉంటివి. నువ్వు పనికి పోయినంకలైరి ఒక్కదానికి ఎట్లతోత్తున్నదో ఏమో?"

"పది రోజుల్నుంచి కుట్టుపని సేత్తున్న అత్తమ్మా. రెడీమేడ్ కంపెనోల్లు అంగీలు (చొక్కాలు) మొండేలు, కాలర్లు, సేతులు వేరు వేరు కుట్టిస్తరు. అవి మనం అతికించి కుట్టి అంగి తయారుసెయ్యాల. ఆల్లే పొద్దుగల్ల తెచ్చిస్తరు, కుట్టిన బట్టలురాత్రి తీసుక పోతరు. అంగికింతని రోజు కూలి రోజిత్తరు. ఎదో పాల, నీల్ల కార్సులన్న ఎల్తున్నయి" లహరి చెప్పింది.

"పాలకర్సు సరేగని, నీల్ల కర్సేంది" మహీధర్ చెల్లెలు అడిగింది. "ఏం జెప్పాలె. ఆడ, నీల్లకు బాగ తిప్పలున్నది. మున్సిపాల్టీనీల్లు రోజు అర్ధగంట (అరగంట) అత్తయి. అవి తాగెతందుకైతయి. బట్టలకు, బాసండ్లకు (పాత్రలకు) ట్యాంకర్ నీల్లే. మా బిల్డింగోల్లు రోజు నాలుగయిదు ట్యాంకర్లు తెప్పిత్తరు. ఇంటింటికి నీల్ల మీటర్లున్నయి. ఆ మీటరుతోని నెలకు అయిదారువందలు నల్లబిల్‌కే అవుతాయత్తమ్మా""

నీళ్ళ ప్రసక్తితో లహరి కళ్ళలో నీళ్ళు !

అయిదారేళ్ళ క్రితం తనకు, అమ్మకు జరిగిన సంభాషణ జ్ఞప్తికి వచ్చింది మహీధర్‌కి.

"మహీ! నల్ల గట్ల చాలు పెట్టినవేందిరా? బంగారం అసుంటి నీల్లు గటేరుపాలు గావట్టెగదా!" మహీధర్‌ను మందలించి, మనెమ్మ తానే కుళాయి కట్టేసింది.

"పోతెవాయెనే మనదేంబోతది? మున్సిపాల్టీనల్లేనాయె. మనటాకి (ట్యాంకు - డ్రమ్) బిందెలయితే నిండినయి. బట్టలు, బాసండ్లు గూడా సేత్తివి. పోతెపాయె నీల్లు" ఇరవదేళ్ల మహీధర్‌లో నిర్లక్ష్యం.

"అట్లనద్దు బిడ్డా! నీల్లంటే గంగమ్మ తల్లి. నీల్ల విలువ ఎగుసం (వ్యవసాయం) జేసె కాపోల్లనాడుగు సెపుతరు. నీల్లు లేకపోతే పంటలు లేవు. పంటలు లేకపోతే తిండిలేదు. నీల్లంటె ఇంటి బర్కతు, ఏ ఇంట్ల నీల్లుపుజుల్ (వృథాగా) పోతయో ఆల్లింట్ల పైసలు నిల్వయి. ఏ రోగాలకో రొచ్చులకో పైసలు గూడ నీల్లలెక్క కర్చయితై. ఒక్కొక్క రూపాయిని కండ్లకెట్ల అద్దుకుంటామో, అట్ల ఒక్కొక్క నీల్ల బొట్టును గూడ కండ్లకు అద్దుకోవాలి. ఇప్పుడు ఇంటింటికి నల్లలచ్చుట్ల (కుళాయిలు ఉండడం వల్ల) మీకు నీల్ల విలువ తెలుత్తలేదు. మీరు సిన్నగుండంగ ఈ చాల్లోల్లందురం సర్కార్ నల్లకే నీల్లు పట్టుకుంటుంటిమి. నా బిందె ముందంటే, 'నేను ముందచ్చిన' అని ఆడోల్లు రోజు సికలు, సికలు (సిగలు) పట్టుకునుడే, ఆ కొట్లాటల్ల మన బిందె'కు ఎన్ని నొక్కులు పడ్డయో నా ఎంటెకెలెన్ని ఊసిపోయినయో? మీబాపైతే రోడ్డుమీద నల్లకాడ తానానికి (స్నానానికి) పోతుండే. బస్సులు, మోటార్లు, మనుసులు, రాంగ, పోంగ మన చాల్ల మొగోల్లు చడ్డీల మీద 'తానం' జేత్తుండ్రి. అచ్చిపోయే ఆడోల్లయితే

మొకం ప్రక్కకు తిప్పుకుంటుండ్రి. తానం నీల్ల కొరకు మొగోల్లు మానం పోయినా పర్వజెయ్యలే. మీరు ఇప్పుడు నీల్లు ఉత్తగ పోగొడ్తున్నరు" మనెమ్మ తన బాధను వ్యక్తపరిచింది.

"మేమేం జేసినా నువ్వు పాతకాలం సంగతులు తీత్తవు. కొంచెం సేపు నల్ల చాలుపెట్టిన్నెమో నువ్వు గిన్ని మాటలు ఇన్పిత్తివి. మా కాలేజోల్లు నల్లచాలువెట్టి అన్ని పన్లు నల్లకిందనే జేత్తరు. అదే నేను నల్లచాలు వెట్టి మొకం కడిగితే నల్లబందు జేసి ముంతతోని నీల్లు తీస్కోమ్మంటే" మహీధర్‌లో నిష్ఠూరం.

"పట్నంల (హైదరాబాద్‌లో) దినం దప్పి దినం నీల్లత్తయట. నీకు గట్లుంటే పనున్నా లేకపోయినా, నల్లచాలుపెట్టుడు ఏర్పడుతుండే."

"మహీ! ఏరోకులున్నవ్! సెల్లెమాట్లాడిత్తె సప్పుడు జేత్తలేవు?" మనెమ్మ కుదుపుతో వర్తమానంలోకి వచ్చాడు మహీధర్.

"అవ్వా! నువ్వనట్టు నీల్లతోనే మనకు బర్కతు. ఈ చాల్ల ఉన్నప్పుడు ఎన్ని నీల్లు వృథా జేసిన్నో, భయందరుకుపోయిన్నుంచి ఒక్కొక్క నీటిబొట్టుకు కటకట ఉన్నది. నిన్ను, నీ మాటల్ని రోజుకు పదిసార్లన్నా యాదిజేసుకుంట. ఏ వస్తువైనా అది లేకపోయినప్పుడే దాని విలువ తెలుత్తది. మా నీల్ల కర్సు కొరకు, లహరి గూడా పని జెయ్యవలసి వచ్చే. పుట్టింట్ల పుస్తకాలు, టివి. తోని అరాంగ గడిపిన మీ కోడలు, మనింట్ల మిషను తొక్కవలసి వచ్చే" మహీధర్ మాటల్లో బాధతో కూడిన నిజాయితీ "సాల్లెండి సోద్దెం. ఏంపని లేకపోతే ఆ మాట వేరెగని పనిసేసుట్ల వున్న మజ టీ.వి. సూసుట్ల ఉంటదే" లహరి.

"వదినా! వదినా! మన చాల్ కూలగొట్టి పెద్దబిల్డింగు కద్తారట. వచ్చే నెల ఈ రూం కాలిజెయ్యాలట"

"ఓ మహీ! మనకు బైటూర్ల ఉండెతందుకు రెండేండ్ల బాడిగెలు ఇత్తరు. అప్పుడు మేము కూడా భయందరకే అత్తం. ఈ బిల్డింగయినంకా మనందరం మల్ల ఇక్కడి కొత్తింట్ల కద్దం. మీరు గూడా మాతోనే ఉందురు".

"అంతకంటె సుఖం ఏం గావాలె" మహీధర్ లహరి ఒక్కసారే అన్నారు. వాళ్ళకు బర్కత్ కావాలి 'మరి'!

నేటి నిజం ప్రత్యేక అనుబంధం

**2007**